# చెప్పు తెగింది

● కె. గోదావరిశర్మ

"ఒరేయ్ ప్రపంచంలో అతివిచిత్ర వస్తువుల్లో ఓదాని పేరు చెప్పు?"

"నువ్వే చెప్పు."

"చెప్పు. చెప్పుల్రా నాయనా! లోకములో చెప్పులంత విచిత్ర వస్తువు నాకింకేదీ కనిపించలేదు...హైహీల్డ్ చెప్పులూ ప్రేమా ఒకేలాంటివంటే నమ్ముతావా నువ్వు? హైహీల్డ్ చెప్పులు మనిషినీ ప్రేమ మనసునీ ఎత్తుగా నించో పెడతాయి. అలాంటి గొప్ప చెప్పులని .... అరిగిపోతేనో తెగిపోతేనో మూలపడేస్తాం. చెప్పులమీద ఓ చిన్న కవిత్వపు ముక్క రాయబోయాను, వింటావా?"

శ్రోత తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నవాడిలా మొహం పెట్టాడు.

"తప్పదంటావా?"

"నాలుగు లైన్లేరా బాబ్బాబు. నీకు పుణ్యం ఉంటుంది. విను సాయంత్రం కాఫీ బిల్లు నాదేలే.

జరిగిపోయిన కాలం

అరిగిపోయిన చెప్పు;

నిన్నటి పేపర్లో కాలం

నేడు పనికొస్తుందా చెప్పు?"

"ఇంతేనా? ఒరే, ఇక ముందు ఇలాంటి చిన్నచిన్న ముక్కలే రాయిరా. బ్రీఫ్‌గా రాస్తే ఆముదంలా ఉన్నా అరిగించుకోగలం కాఫీ లేకపోయినా సర్దుకోగలం. నువ్వు మరీ ఇతిహాసాలూ ప్రబంధాలూ రాసేసి అమాయకుణ్ణి నేనొక్కడినే దొరికేనని నన్ను కుర్చీకి కాఫీ టిఫెన్లతో కట్టేసి నా నవరంధ్రాల్లోంచి నీ కవితారసం ఇంజెక్ట్ చెయ్యబూనడం మహా పాపం. నిన్ను ఆ దేవుడు కూడా క్షమించడు" ఆఖరి వాక్యం అక్కినేని నాగేశ్వర్రావుని అనుకరిస్తూ.

"పర్లేదురోయ్. నా ప్రభావం నీమీద కూడా పడ్డేస్తున్నట్టుంది. నువ్వు కూడా పొయిటిక్‌గా మాట్లాడడం నేర్చేసుకుంటున్నావే!" "మరే! బాధలోంచే కవిత్వం పుడుతుందటగా? నా బాధముందు ఆ వాల్మీకి బాధ ఓ బాధా?" తనని కవిమిత్రుడి సాయంకాలానికి ఎరగా వేసి సినిమాహాల్లో దాక్కున్న మిత్రుల్ని తిట్టుకుంటూ.

"సరేగాని నా కవితాఖండిక ఎలాగుందో చెప్పనేలేదు." ఆశగా చూస్తూ. కడుపునొప్పి మరింత తీవ్రమైనట్టుంది. మొహం మీద మాత్రం మొహమాటంలా

-చిరునవ్వు. "బాగుందిలే. నువ్వు రాయడం, బాగుండకపోవడమూనా?"

"కాఫీ ఇస్తానన్నది కవిత్వం వినడానికే. ఆ మాత్రానికే మెచ్చుకోనక్కర్లేదు. బాగులేకపోతే మోహమాట పడకు."

గదిలో మూల చల్లటి నీళ్ళకుండ. లేచి ఒక్కటిచ్చుకుని, "చాలాబావుంది." ఆశ్చర్యం, రెండ్రూపాయల కోసం చన్నీళ్ళలా గదంతా ప్రవహించాయి.

"నీ యిలస్ట్రేషన్ మండిపోనూ. నోటితో చెపితే చాలదూ? కుండ బద్దలు గొట్టి మరీ చెప్పాలా?" అభిషిక్తమైన వస్తుజాలాన్ని ఎత్తైన సురక్షిత ప్రాంతానికి తరలిస్తూ.

"అబ్బే. కాస్త ఎంఫెటిక్‌గా ఉంటుందనీ!"

కాఫీ వచ్చింది. ఇద్దరూ తాగారు. మూడో జీవం ఈదుకుంటూ ప్రవేశించింది. "హేమిటి! మనవాడి కవితా ప్రవాహమా? కవిత విని కారిన కన్నీటి ప్రవాహమా?"

"ఉహుఁ. మన కవి కుమారుడేదో చెప్పుగురించి కవిత చెప్పబోతే సహృదయ రసికులు మెచ్చి వెలువరించిన అభినందనా ప్రవాహం."

"సరే. సరే. ధామ్మనే వార్తాహటి తెచ్చాను. దానితో ఈ ప్రవాహాలకి ఆనకట్ట పడుతుంది. ఆనక ఏం జరుగుతుందో సినిమా ప్రోమిస్‌వల్లనే చెప్పబడుతుంది. ఇప్పుడే వెధవలిద్దరూ కాఫీ ల్తాగేసినట్టు కనిపిస్తూంది."

"ఏడవకు. నీకు నచ్చిన సినిమా గ్రాంటయింది. వార్త చెప్పి చావు. దశదిశలకీ పరిగెత్తిన నా కవితాబాణాలకి ఏ ఎడిటరైనా విహతుడయ్యాడా? అడ్రసులు దొరికిన అమ్మాయిలందరికీ పంపదడ్డ లౌలెటర్ తాలూకు సైక్లోస్టయిల్డ్ కాపీల్లో దేనికైనా రెస్పాన్సు వచ్చిందా? హఠాత్తుగా మన నాన్నల్లో ఎవరైనా పుత్రప్రేమ పెల్లుబికి నెలలో రెండోసారి ఎం. వో. పంపించాడా? మన ప్రిన్సిపాలుడు ఈ అభినవ గోపాలకృష్ణుడి నూటఒకటో తప్పుని క్షమించలేక సస్పెన్షన్ మెమో పంపించాడా? ఏం జరిగిందో వివరంగా విశదంగా చెప్పు" హలిసిపోయి, గ్లాసుడు నీళ్ళు తాగుదామనుకుని, లేక, ఆయాసపడుతూ కూర్చుండిపోయాడు.


"చెప్పు."

"చెప్పు?!"

"చెప్పు ?!"

"సరిగ్గా చెప్పు."

"నీ ప్రేమ పత్రపు కాపీ ఒకటి అందుకున్న ఓ భామామణి నీకు తన ఎడమకాలి చెప్పు బహూకరిస్తానంది. 'రెండోది కూడా ఇచ్చి పుణ్యం కట్టుకో తల్లీ, భరతుడిలాగా మావాడు వాటినే పూజించుకుంటా'డని చెప్పేను. ఇవ్వకుండా 'హుఁ' అనేసి వెళ్ళిపోయింది. అలా వెళ్ళినది వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్లింది. ఆయన మీ నాన్నకి బాల్యస్నేహితుడు కావడం వల్ల విషయం మీ నాన్నవరకూ వెళ్ళింది. నీ ఆతృతని సహృదయతతో అర్థం చేసుకున్న మీ నాన్న ఈ సమ్మందం ఖాయం చేసుకోవడానికి వస్తూ ప్రిపరేషన్‌కోసం నీకో రెండువందలు మనియార్డర్ కూడా




చేసేడు. అంచేత నువ్వనుమానించిన వాట్లో చాలా నిజమే, నేనిప్పుడు.... అదుగో పోస్టుమాన్ వచ్చేస్తున్నాడు. లేవండర్రా. అప్పరాకి ప్రస్థానం ప్రారంభించండి. ఏవీ సినిమాసఖులు రెండూ గూటికి చేరుకోలేదా?"

"ఉహూ! బాబా! మనవాడు జరగబోయే సన్మానాన్ని ముందే ఊహించి కాబోలు అప్పుడే పూలమీద కవిత్వం రాసేశాడే! హాశ్చర్యం!" "రండి పోస్టుమాన్‌గారూ. రండి." చిరునవ్వుతో వచ్చే పోస్టుమాన్ కెప్పుడూ గౌరవ సంబోధనమే నెలకొకసారి.

రెండువందలు. 'చి. కుమారునకు ఆశీస్సులు. మీ ఊళ్లో నల్లమందు నాగరాజు గారమ్మాయితో నీ సంబంధం విషయం మాట్లాడడానికి ఆదివారం బయలుదేరి వస్తున్నాను. ఈ డబ్బుతో మంచివి ఓ జత బట్టలు కుట్టించుకోవలెను. చదువు, ఆరోగ్యం జాగ్రత్త - నీ తండ్రి" రెండువందలు జేబులోకి, ఎం. వో. కూపన్ ముక్కలు కిటికీలోంచి బయటికి. "పదండి. పదండి"

"సరేగానీ రేపాదివారం నిజంగానే మా నాన్న దిగిపోతే! నా కట్టుకోడానికి సరైన గుడ్డముక్కైనా లేని సంగతి మీకు తెలుసుకదా! పెళ్లిచూపుల కెలా వెళ్ళడం?" ఆందోళనా వేదనాత్మకలు.

పోవోయ్. మేం లేమూ?" చిరునవ్వుతూ.

* * *

ఆదివారం వచ్చింది. ముసలాయనని బజాన వేసుకుని దగ్గు ముందొచ్చి దాని వెనక తండ్రి వచ్చాడు. అంతకి రెండురోజుల ముందు పెళ్ళి చూపుల కుమారుడికి అమ్మాయిదగ్గర్నుంచి గౌరవ

కరమైన జవాబు వచ్చింది. కవికుమారుడి తల మబ్బుల్లో (బంగారు కిరీటం ధరించి) విహరించింది. ముందు చూపు గల కుర్రాళ్ళు గది స్వరూపాన్ని మార్చేశారు. జ్యోతిలక్ష్మి శ్రీకృష్ణుడి వెనక దాక్కుంది. ఖాళీ బీరు సీసాలు మంచి నీళ్ళతో నింపబడ్డాయి, లేబుల్స్ చింపేసి. పేకలూ సిగరెట్టు పీకలూ పక్క రూములకి వలస వెళ్ళాయి.

ఊఁ! ఇంతకీ చదువెలా ఉంది? డబ్బు పంపమనే గాని చదువు సంగతీ, ఆరోగ్యం సంగతీ ఉత్తరాలు రాయరు కదా!" కుర్రాళ్ళు వినయం తలొంచుకుంది. భూతదయగల కుర్రాళ్ళు, సాలీళ్ళు తమ పుస్తకాలే గోడలుగా ఇళ్ళు కట్టుకుంటూంటే వాటిని డిస్టర్బ్ చెయ్యదలుచుకోలేదు." ఈ పుస్తకాలన్నీ పనికొచ్చేవేనా లేక...." అని అనుమానిస్తూ వాటి మీద చెయ్యి వేసేటంతలో ఝామ్మంటూ దోమలూ ధూళీ ఆ ప్రయత్నానికి అంతరాయం కలిగించేయి.

"ఊ! సరే బయల్దేరు టైమవుతోంది. ఏవోయ్, మీ రెవరైనా కూడా వస్తున్నారా మాతో?"

"ఆబ్బే, ఎందుకులెండి. ఇందర్ని చూసి ఆ అమ్మాయి బెదిరిపోవచ్చు!" అసలు రహస్యం, రోజూ పార్కుదగ్గర ఈలలు వేసే గ్రూపే ఈ రోజు హఠాత్తుగా ఇంట్లో ప్రవేసిస్తే కుర్రాళ్ళతోబాటు పొరపాటున ముసలాయనక్కూడా దేహశుద్ధి జరిగే ప్రమాదం లేకపోలేదు.

"అంచేత, మీరు వెళ్ళిరండి."

'ఊఁ ఇవేసేమిటోయ్ కొత్తబట్టలా? అనుమానం. సరిపోయే బట్టలే ఇస్తానని చెప్పి ఇప్పుడు ప్రతి కొలతా మూడంగుళాలు ఎక్కువగల బట్టలిచ్చి ఎటో చూస్తూ నిలబడ్డ మిత్రుడివైపు నిస్పృహాయంగా చూసి, 'అదే! ఆ టైలరు.... పొరపాటున నా బట్టలు ఇంకెవరి కొలతలతోనో కుట్టేశాడట....ఈ రోజా కిలా కానీంది. సాయంత్రం మళ్ళీ వాడికే యిచ్చి రిపేరు చేయిస్తాను.'

'సర్లే! ఏపని సవ్యంగాచేసి ఏడిసేవు గనక! పద పద నేనలా ముందువెళ్ళి ఓ కిళ్ళీ కట్టించుకుంటాను. త్వరగా తెములిరా!'


'ఏవీ నా చెప్పులేవీ? ఓహో తెగేయి కదూ! ఒరే నీ చెప్పులేవిరా?'

'ఒరే నా బూట్లు వేసుకు వెళ్ళరా'

'ఊహుఁ ఎందుకూ దీనికోసం ప్రత్యేకంగా మేకప్ అయి వెళ్ళినట్టు వెళ్ళడం? సహజంగా ఉండాలి.' పోజుగా అంటూ మంచం కోడు క్రింద ఇరుక్కుని డొప్పలా అయిపోయిన చెప్పుని అటూ ఇటూ వంచి బాగుచేశాడు.

'జాగ్రత్తరోయ్ దార్లో అవి నిన్ను అన్యాయం చెయ్యవుగదా? పాపం అప్పుడే రెండు మూడు కుట్లు పడ్డట్టున్నాయి. ఈసారి ఆపరేషన్ అయితే ప్రాణానికే ముప్పు.

'పర్లేదు లేవోయ్' స్వంతదారుహామీ. 'ఈ చెప్పులు చాలా విశ్వాసంగా నన్ను సేవిస్తున్నాయి. ఏదో మొన్న సినిమాకి వెళ్ళినప్పుడు.... ఓ స్త్రీ నా అడుగులో




అడుగు వేసి నడిచింది. దాంతో నా చెప్పులకి ఒళ్ళు పై తెలియలేదు. 'అంతేగాని మామూలు పరిస్థితుల్లో అవెప్పుడూ కాలి కింద చెప్పులాగే ఉంటాయి.'

'వెనవ్విట్టు' చెప్పులు వేసుకుని ఇరుకు గదిలోనే ఇటూ అటూ పచారు చేసి, 'ఒరే ఏడడుగులు వేసినా అనుబంధం కుదరలేదురా!' ఆఖరి క్షణంలో నిస్సహాయత.

'మరేం బెంగ పెట్టుకోకు. మొదట్లో అలాగే ఉంటుంది. కొత్తచెప్పులూ కొత్త పెళ్ళాం కొంతకాలం కరుస్తారు. మరి కొంతకాలం అరుస్తారు. ఆ తర్వాత అణిగిమణిగి ఉంటారు.'

ప్రస్థానం ప్రారంభమైంది. తండ్రి వెనకకొడుకులా, సిన్సియారిటీ ముఖంమీద ధరించి, తనవికాని బట్టల్లో ఇబ్బందిగా కదులుతూ, రోడ్డుమీద వాళ్ళంతా ముళ్ళ లాంటి చూపులతో తననే గుచ్చుతున్నట్టు అనుభూతి, 'ఊళ్లోకి కొత్త సర్కస్ ఏదీ రాలేదు. నేను అందులో బఫూన్‌ని కాను' అని అందరికీ చెప్పాలనిపించింది. అప్పుడప్పుడు వెనక్కి తిరిగి త్వరపడమనే రిమైండర్ చూపులు. ఇష్టమైనట్లల్లా నడిస్తే పాదరక్షలు ప్రతిఘటిస్తాయి.

వాళ్ళిల్లొచ్చింది. 'హమ్మయ్య' పెళ్ళివారిని గుమ్మం దగ్గరే అలా ఆపి పాతకులకు కొన్ని విషయాలు చెప్పాలి.

అంటే మనియార్డరు రావడానికీ మున లాయన రావడానికీ మధ్య వ్యవధిలో జరిగినవన్నమాట. పంపబడ్డ అనేక ప్రేమ పత్రాలలో ఒక్కదానికే జవాబు వచ్చినందుకు హీరో బాధపడలేదు. నాటి నుండి ఆ స్త్రీనే సీతాదేవిగా, తననే రాముడిగా ఊహించుకుని ఏక ప్రేయసీ వ్రతం ప్రారంభించాడు. అయితే ఈ జవాబు రావడంలో 'థియరీ ఆఫ్ కో-యిన్సిడెన్స్' అన్నది ఒకటి పని చేసిందని అతనికి తెలీదు. ఆ అమ్మాయి అడ్రసు 'సంపాదించడం' తన ఘన కార్యం కాదనీ, ప్రేమలేఖలు రాసే ఉద్దేశ్యంతో అతను అడ్రసులు సేకరిస్తున్న సమయంలో ఈ అడ్రసు కూడా అతనికి 'అందించబడిందనీ' వీళ్ళ పెళ్ళిని చాలాకాలమై ప్లాన్ చేస్తున్న వాళ్ళ తల్లిదండ్రుల ప్రయత్న ఫలితమే ఇదనీ, తన్రాసిన ప్రేమలేఖకి జవాబు ఆ తండ్రే అమ్మాయిచేత జాగ్రత్తగా డ్రాఫ్టు చేయించి పంపించాడనీ, ఇతని ప్రేమపిచ్చి వ్యవహారం గమనిస్తున్న ఆ అమ్మాయి త్వరపడమని తండ్రికి వలహా ఇచ్చిందని— పాపం ఇవేవీ అతనికి తెలియవు. హీరోకి తెలియకపోయినా కథకుడికి తెలుస్తాయి కదా! పోనీలే పాఠకులని మీక్కూడా రహస్యాలన్నీ చెప్పేస్తున్నా నన్నమాట. ఇవన్నీ మీరు వెళ్ళి ఆ కుర్రాడికి చెప్పెయ్యకండి. పెళ్ళయ్యాక శోభనం గదిలో ఆ అమ్మాయి చేతే చెప్పిద్దాం అవన్నీ.

ఏం? ఇంతకీ ఇప్పుడు పెళ్ళివారు పెళ్ళిచూపులకొచ్చేరుకదా! ఆహ్వానాన్నీ నమస్కారాల్నీ అందుకుని లోపలికి ప్రవేశిస్తున్నారు. అసలే అబ్బాయికి ఆత్రుతగా ఇంకేదోగా ఉంటుందా? చూపులు లైట్‌హౌస్ కిరణాల్లా ఆ అమ్మాయికోసం చుట్టూ గాలిస్తున్నాయా అలాంటప్పుడు ఎవరూ నేలచూపులు చూడరుకదా! ఆ సమయంలో విశ్వాసంగా ఉండవలసిన చెప్పులు ద్వారబంధాన్ని ముద్దుపెట్టుకుని, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, బంధాలన్నీ సడలించుకుని, యజమానిని అమాంతం ముందుకి బోర్లా పడేటట్టు చెయ్యడం ఏం న్యాయం చెప్పండి? కాని ఈ చెప్పులకి చిలిపితనం యెక్కువ. సరిగ్గా అలాగే చేశాయి. సాష్టాంగ ప్రమాణం చేస్తున్న అల్లుడిని చూసి మురిసిపోయాడు మావగారు. ఆహా, ఏం వినయం! ఏం వందనం.

'లేనాయనా ఇంకా ఈ రోజులలో ఇంత చాదస్తమేమిటి?' అన్నాడు.

ప్రక్క గదిలో అమ్మాయి మాత్రం పెళ్ళికొడుక్కి మంచి చెప్పులజత కానుకగా ఎవరైనా చదివిస్తే బాగుండును అనుకుంది.